భరోసా ఇవ్వని 'ఉపాధి హామీ'

- కూలీలకు సరిగా విడుదల కానీ వేతనాలు - జిల్లాలో రూ. 15 కోట్లకు పైగా పెండింగ్ వేతనాలు

22న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టం నిరుపేద వ్యవసాయ కూలీలకు ఎలాంటి భరోసా కల్పించని పరిస్థితి నెలకొంది. ఈ చట్టం గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు అండగా నిలుస్తుందని భావిస్తే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దీనిని నీరుగారుస్తుంది. ఈ పథకానికి నిధులు విడుదల కూడా మొండి చేయి చూపుతుంది. కూలీలు చేసిన పనులకు కూడా సరైన వేతనాలు చెల్లించకపోవడంతో పనులకు వెళ్లేందుకు ముగ్గు చూపడం లేదు. కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద దాదాపుగా నాలుగు లక్షల మంది పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారు. పశ్చిమ ప్రాంతంలో నుండి ప్రతి ఏటా లక్ష నుండి రెండు లక్షల మందికి పైగా వ్యవసాయ కూలీలు పనుల కోసం వలసబాట పడుతుంటారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు గిట్టుబాటు కూలి రాకపోవడంతో పాటు వేతనాల చెల్లింపులో కూడా ఆలస్యం అవుతున్న నేపథ్యంలో పనులకు వెళ్లేందుకు కూలీలు నిరాకరిస్తున్నారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్ ప్రభుత్వం చెల్లించేది. ఈ ఏడాది కూలీలకు ఎలాంటి సమ్మర్ అలవెన్స్ చెల్లింపులను చేయడం లేదు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులకు దాదాపుగా1.50 లక్షల మంది కూలీలు మాత్రమే పనులకు హాజరవుతున్నారు. కూలీలు చేసిన పనులకు కూడా వేతనాలు చెల్లింపు సరిగా విడుదల కావడం లేదు. జిల్లాలో దాదాపుగా రూ.15 కోట్లకు పైగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీల సంఖ్య రోజువారిగా తగ్గిపోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులపై రోజువారిగా సమీక్ష చేపడుతున్నారు. కూలీల సంఖ్యను పెంచకపోతే సంబంధిత ఉపాధి హామీ అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు (ఫైల్)

ఉపాధి హామీ చట్టాన్ని ఓవైపు కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంటే మరోవైపున రాష్ట్ర ప్రభుత్వం కూడా అదేవిధంగా వ్యవహరిస్తుంది. ఈనెల 22న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలను కోరుతూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమానికి సన్నద్ధమయింది. కూలీలకు చెల్లిస్తున్న వేతనాలను రూ.600లకు పెంచడమే కాకుండా 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కూలీలతో ఆందోళన కార్యక్రమానికి చేపడుతుంది.

ఉపాధి హామీని బలోపేతం చేయాలి

- కెవి.నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా కూలీల సంక్షేమానికి మరింత చర్యలు తీసుకోవాలి. ఉపాధి కూలీలకు ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలను రోజుకు రూ.600 పెంచడమే కాకుండా 200 రోజులు పని దినాలు కల్పించాలి. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు నీడ వసతి కల్పించాలి. సమ్మర్ అలవెన్స్ లోని కూడా కూలీలకు ఇవ్వాలి.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టం ్జి.సజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 24 నుండి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ పై కలెక్టర్ డాక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఈ నెల 24 నుండి జూన్ 1 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 53 సెంటర్లలో 16,865 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు, 8694 మంది రెండవ సంవత్సరం పరీక్షలకు మొత్తం 25559 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇందులో 23492 మంది జనరల్, 2,067 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు సెషన్లలో ఉ.9.00 గం. ల నుండి మ 12.00 గం.ల వరకు మొదటి సంవత్సరం, మ.2.30 గం.ల నుండి సా.5.30 ల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల నిర్వహణ లో భాగంగా సంబంధిత అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సెల్ ఫోన్సను భద్రపరుచుకోవడానికి క్లాక్ రూమ్ ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. జెడ్పి సిఇఒ, డిఇఒ పరీక్షల కంటే ముందే పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి అన్ని వసతులు ఉన్నాయా లేవా అని పరిశీలించాలన్నారు. రెవిన్యూ అధికారులు ఫ్లైయింగ్ స్క్వాడ్ ల ఏర్పాటు, పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ షాపులను పరీక్ష సమయంలో మూసి ఉంచేలా చూడాలన్నారు. ఆర్టిసి అధికారులు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా బస్సులను నడపాలన్నారు. ,జిల్లా లోని బస్సు సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాలు పత్తికొండ, మంత్రాలయం, నాగులదిన్నె, చిప్పగిరి, తుగ్గలి. తదితర ప్రాంతాల నుండి పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలున్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ నాగేశ్వరరావు, ఆర్ఐఒ గురువయ్య శెట్టి, జడ్పీ సిఇఒ నాసర రెడ్డి,డిఇఒ రంగారెడ్డి, అడిషనల్ డిఎం అండ్ హెచ్ఒ భాస్కర్, డివిఇఒ జమీర్ బాషా, డిఇసి మెంబర్స్ కె నాగభూషణ్ రెడ్డి, జి లాలెప్ప, ప్రభు, గోవిందరాజులు, సంబంధింత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

మార్చి చివరి వారానికి భానుడు భగభగలాడుతూ ప్రస్తుతం నిపవిల కొలిమిలా మారిపోయాడు. జిల్లాలో వేసవి తీవ్రత పెరిగింది. గతవారం రోజుల నుంచి ఎండ ఉగ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెల ప్రారంభంలో కర్నూలు నగరంలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో 36 డిగ్రీలు, ఆలూరులో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. మార్చి 26 నాటికి కర్నూలు, ఓర్వకల్లులో అధికంగా 39 డిగ్రీలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అది అమాంతం పెరగడంతో ప్రస్తుతం జిల్లాలో ఆలూరులో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కర్నూలులో 42 డిగ్రీలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయంలో 41 డిగ్రీలు, ఆదోని, పత్తికొండలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కొనసాగుతున్న యువగళం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. తొలుత డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, పాణ్యం, కర్నూలు, నందికొట్కూరు, శ్రీశైలం, నంద్యాల నియోజకవర్గాల్లో ముగిసింది. ప్రస్తుతం బనగానపల్లె నియోజకవర్గంలో సాగుతోంది. అడుగడుగునా పలు వర్గాలు, గ్రామస్తులు, పలు సంఘాల ప్రతినిధులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు.

నంద్యాల టిడిపిలో విభేదాలు

నంద్యాల జిల్లా టిడిపిలో విభేదాలు మరో సారి భగ్గుమన్నాయి. ఎపి విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఎవి.సుబ్బారెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ మధ్య గతం నుండే విభేదాలు ఉన్నాయి. పలు సందర్భాల్లో అవి బయటపడ్డాయి. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా మంగళవారం మరో సారి ఆ రెండు గ్రూపుల మధ్య విభేదాలు బయటపడ్డాయి.



అప్రకటిత విద్యుత్ కోతలను అరికట్టాలి

- ఎస్ఇకి పిపిఎస్ బృందం వినతి

- అంతరాయం లేకుండా కరంటు సరఫరాకు ఎస్ఇ ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భరించలేని ఎండ వేడిమి, నగరంలో కరెంటు కోతల వల్ల చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు అనారోగ్యంతో ఉన్నవారి బాధ వర్ణాతీతమని వెంటనే అప్రకటిత కరెంటు కోతలను అరికట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం (పిపిఎస్) ప్రతినిధి బృందం శనివారం ఉదయం విద్యుత్ శాఖ సూపర్‌ండెంట్ ఇంజనీర్ ఉమాపతిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఉదాహరణకు సంతోష్ నగర్ లో నిన్న రాత్రి 12 గంటల నుండి ఒకటిన్నర వరకు కరెంటు కోతతో ఇబ్బందులు పడ్డామని, వారం క్రితం మూడు గంటలసేపు కరెంటు లేక పోయినా ఎవ్వరూ స్పందిచలేదని వెంకటేశ్వర్లు, ఎన్.రఘురామిరెడ్డి, కె.గోపీనాథ్ ఎస్ఇకి వివరించారు. నగరంలో అప్రకటిత కరెంటు కోతలను అరికట్టాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎం. చంద్రమోహన్ రెడ్డి కోరారు. కరెంటు సరఫరాకు అంతరాయం కలగనీయమని విద్యుత్ ఎస్ఇ హామీ ఇచ్చారు. ఇస్ఇ మాట్లాడుతూ కరెంటు సరఫరాకు అంత రాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముందుగానే ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు మరమ్మతుల కు కావాల్సిన పరికరాలన్నీ సరఫరా చేస్తామని సంబంధిత అధికారులకు అక్కడికక్కడే హెచ్చరిస్తూ ఆదేశాలు ఇచ్చారు. కరెంటు అంతరాయం కలిగితే సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు ఏ సమయంలోనైనా ఫోన్ ద్వారా తెలియజేయాలని ప్రతినిధి బృందానికి కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న పిపిఎస్ బృందం

22న ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరీయం చేసే ఆలోచనను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకట రాముడు, సిఐటియు మండల అధ్యక్షులు ఉషనయ్య డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జిల్లా కర్నూలు మండలం దిన్నేదేవరపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరవు పని అనేది దేశంలో వున్న పేద ప్రజలకు ఒక వరం లాంటిదని, దీనివల్ల వేసవికాలంలో కూలీలకు నాలుగు మెతుకులు దొరుకుతున్నాయన్నారు. ఇలాంటి ఉపాధి హామీ చట్టానికి పార్లమెంట్‌లో ఈ సంవత్సారం రూ.70వేల కోట్ల బడ్జెట్‌లో కోత విధించారని అన్నారు .పెట్టుబడి దారులకు రాయితీలు ఇచ్చిందన్నారు. ఉపాధి హామీ చట్టంలో వున్న సౌకర్యాలన్నీ తొలగించి కొత్త పద్ధతులను తీసుకొస్తుందన్నారు. దీనివల్ల ఉపాధి కూలీలను పోమ్మనలేక పొగ పెట్టినట్లు వుందన్నారు. కుటుంబాలు పెరగడం వలన 100రోజుల పనులు సరిపోవడం లేదన్నారు. రేట్లకు అనుగుణంగా రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, వారం వారం చేసిన పనులకు ప్లేస్లిప్పులు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ , రవాణా చార్జీలు ఇవ్వాలని, నీడ వసతి కల్పించాలని, అన్ లైన్ మస్టర్ రద్దు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ దగ్గర నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. సిఐటియు నాయకులు నాగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న వెంకట్రాముడు

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

దిశా యాప్ పై అవగాహన కల్పించాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ పరిధులలోని గ్రామ, వార్డు సచివాలయలలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొదటి సారిగా ఎస్‌పి జి.కృష్ణకాంత్ సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల రక్షణ కోసం ప్రతి సచివాలయం పరిధిలో ఒక మహిళ పోలీసులను నియమించిందని మీరు కూడా పోలీస్ వ్యవస్థలో ఒక భాగమన్నారు. ప్రతి ఒక మహిళ పోలీసు తమ సచివాలయం పరిధిలోని గ్రామ, పట్టణ మహిళలతో క్రమంతప్పకుండా మమేకమౌతూ, తద్వారా వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. పై అధికారుల సహాయంతో పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. గ్రామాలలో వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు, కుటుంబ తగాదాలు, స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి స్త్రీ కి దిశ యాప్ గురించి అవగాహన పెంచాలన్నారు. తమ పరిధిలోని పాఠశాలలను క్రమంగా సందర్శించాలన్నారు. విద్యార్థినిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మొదలైన ఇతర విషయాలపై అవగాహన పెంచాలన్నారు. మహిళలు, బాలికలు లైంగిక దోపిడికి గురికాకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచుతూ ఆ సమాచారాన్ని పోలీసు అధికారులకు అందజేయాలన్నారు. మంచి సత్సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మహిళా పోలీసులకు కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. మహిళా పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, సఖి ఒన్ స్టాప్ సెంటర్, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ , ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల చట్టం, బాల్యవివాహాల చట్టాల గురించి తెలుసుకుని అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి వెంకటాద్రి, డిపిఒ ఎఒ సురేష్ బాబు, సిఐలు, ఎస్ఐలు, ఆయా గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభం

కర్నూలు కలెక్టరేట్ : చిన్నటేకూరులో గల ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం ప్రారంభం కానుందని డైరెక్టర్ కెజె.రెడ్డి తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు చిన్న జీయర్ స్వామి ప్రారంభించనున్నారని, ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపి టిజి.వెంకటేష్ , పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈ ప్రారంభోత్సవానికి అందరూ ఆహ్వానితులేని ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధిలో కర్నూలు నగరం రోల్ మోడల్

వార్డుల వారీగా సమీక్ష -విస్తృ త ప్రచారానికి ఎమ్మెల్యే, మేయర్ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత నాలుగేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం నగరంపై చూపిన ప్రత్యేక చొరవకు ఫలితంగా అభివృద్ధిలో కర్నూలు నగరం రోల్ మోడల్‌గా నిలిచిందని నగర మేయర్ బివై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎ.భార్గవ్ తేజ నేతృత్వంలో 2, 4, 6, 13, 25 వార్డుల అభివృద్ధిపై కార్పొరేటర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షకు మేయర్, ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా వార్డుల వారీగా ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, హెల్త్, రెవెన్యూ విభాగాల సమస్యలపై చర్చించారు. స్థానిక కార్పొరేటర్ చెప్పిన సమస్యలపై పరిష్కార మార్గాలను అన్వేషించారు. పెండింగ్లో ఉన్న సమస్యల పురోగతి, ఆలస్యానికి కారణాలపై ఆరా తీశారు.మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందేంత స్థాయిలో కర్నూలు నగరాభివృద్ధి జరిగిందని, మరెక్కడా కర్నూలు తరహా అభివృద్ధి జరగలేదన్నారు. అయితే వీటిని ప్రచారం చేయడంలో వెనుకబడుతున్నామని, సోషల్ మీడియాతో పాటు ఇతర ప్లాట్ ఫాంలను వినియోగించుకుని దూకుడు పెంచాలన్నారు. కార్పొరేటర్లు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని, అధికారులు తప్పనిసరిగా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారించాలని ఆదేశించారు. త్వరలో ఇతర శాఖల అధికారులతో కూడా సమావేశాలు నిర్వహిద్దామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అర్షియా ఫర్హీన్, సిత్ర సత్యనారాయణమ్మ, నిలోఫర్, విజయలక్ష్మి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఉప కమిషనర్ ఎస్‌వి.రమాదేవి, ఎస్ఇ డి.వేణుగోపార్, ఎంఇలు శేషసాయి, షాకీర్, ఎంహెచ్ఒ విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ , వేదికపై మేయర్

అర్హులకు సంక్షేమ పథకాలు : కాటసాని

కాటసాని రాంభూపాల్‌రెడ్డిని దీవిస్తున్న సీనియర్ మహిళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 20 వార్డ్ 52 వ సచివాలయం పరిధిలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వార్డులోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరించారు. జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వార్డ్ కార్పొరేటర్ ఎ. నాగ లక్ష్మీరెడ్డి, వార్డు నాయకులు శివవరం మహేశ్వర రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, భీమ శంకర్ రెడ్డి, రంగారెడ్డి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నవీన్, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత్ రెడ్డి, శ్వేతారెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతురెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బిసిల ద్రోహి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

డమ్మీ బిసి కులాల కార్పొరేషన్లు ఏర్పాటుచేసి పేరుకు మాత్రమే చైర్మన్లను నియమించిన సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డి బిసిల ద్రోహిగా చరిత్రలో నిలిచారని టిడిపి బిసి సెల్ నాయకులు మల్లికార్జున, ప్రభాకర్ యాదవ్, మహేష్ గౌడ్, విజయ్ యాదవ్ ఆరోపించారు. శనివారం 20 వార్డులోని టిడిపి కార్యాలయంలో బిసి నాయకులు మాట్లాడుతూ బిసి కులాల కార్పొరేషన్ల ఏర్పటుతో బిసిలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. 56 కార్పొరేషన్లకు నిధులు ఎందుకు కేటాయించలేదని వారు జగన్ రెడ్డిని ప్రశ్నించారు. రిజర్వేషన్ల రద్దుతో 16,800 పదవులు దూరం అవడం సిగ్గు చేటని, ఒక్క ఫైలు పై కూడా సంతకం పెట్టలేని దుస్థితిలో బిసి కులాల చైర్మన్లు ఉన్నారన్నారు. బిసి విద్యార్థులకు విద్యా పథకాలు రద్దు చేసిన దుర్మార్గుడు జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, నంద్యాల పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు ప్రజా వైద్యశాల మల్లికార్జున, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట్ర సెక్రెటరీ కాసాని మహేష్ గౌడ్, తెలుగు యువత కార్యదర్శి విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న బిసి నాయకులతో గౌరువెంకట్‌రెడ్డి

సిపిఆర్‌తో బిడ్డ ప్రాణాలు కాపాడిన తల్లి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రెండేళ్ల చిన్నారి మెహవిష్‌ను అత్యవసర పరిస్థితిలో మెడికవర్ హాస్పిటల్ కు తెచ్చారు. పాప ఆడుకుంటూ ఇంటి దగ్గర ఉన్న సంపులో పడిపోవడంతో పాప తల్లి గమనించి వెంటనే నీటిలో నుండి బయటకు తీసింది. ఆ సమయంలో పాప ఊపిరి తీసికోక పోవడంతో పాటు నీలం రంగులోకి మారిపోయింది. ఆ సమయంలో తల్లి సమయస్ఫూర్తితో వ్యవహరించి వెంటనే సిపిఆర్ (కార్డియో పల్మనరీ రిసాసిటేషన్) ఆగిపోయిన గుండె తిరిగి పని చేసేలా చేయడం అంటారు. అలా చేసి మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకొని వచ్చారు. హాస్పిటల్‌కు వచ్చిన సమయానికి రక్తంలో ఆక్సిజన్ స్థాయి చాలా తక్కువగా ఉండటం వలన వైద్యులు కృత్రిమ శ్వాసతో పాటు తగిన వైద్యం అందించడంతో పాప కోలుకుంది. పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ మురార్జీ మాట్లాడుతూ తల్లి సమయస్ఫూర్తితో వ్యవహరించి సరైన సమయంలో, సరైన పద్ధతిలో సిపిఆర్ ఇవ్వడం వలన పాప ప్రాణాపాయ స్థితినుండి బయట పడిందన్నారు. నీటిలో మునిగి పోయిన సందర్భంలో ప్రా ణాలను రక్షించడంలో సిపిఆర్ చాల అవసరం, ప్రజలలో ప్రతి ఒక్కరికి దీనిపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పాప తల్లి మాట్లాడుతూ పాపకు తగిన వైద్యం, జాగ్రత్తలు తీసు కున్నందుకు వైద్యులకు , మెడికవర్ హాస్పిటల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బిడ్డను కాపాడిన తల్లితో మెడికవర్ వైద్యులు

కమిషనర్‌గా ఎ.భార్గవ్ తేజ కొనసాగింపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ ను గతంలో బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం పాఠకులకు విధితమే. కానీ కర్నూల్ నగర పాలక సంస్థకు ఇంతవరకు ఎవరిని కమిషనర్‌గా నియమించకపోవడంతో పాటు శనివారం ప్రభుత్వం మళ్లీ కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఎ.భార్గవ్ తేజను ఇక్కడే ఉండే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది.

కార్పొరేటర్లకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మంచి సేవలు అందించిన కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, విక్రమసింహారెడ్డి, యూనుస్ బాషలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులను ప్రదానం చేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా వార్డుల కార్పొరేటర్లు కూడా తమ వార్డ్ అభివృద్ధికి పాటుపడాలని మేయర్ ఆకాంక్షించారు.

పచ్చదనం ఉట్టిపడేలా అభివృద్ధి చేయాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి పచ్చదనం ఉట్టి పడేలా అభివృద్ధి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని మున్సిపాలిటీ ఖాళీ స్థలాలను, పార్కులను పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణంలో పచ్చదనం తక్కువగా ఉందని, సాయంకాల సమయంలో ప్రజలు సేద తీరడానికి పార్కుల అవసరం ఉందని తెలిపారు. వెంటనే పార్కులను అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఇంజనీర్ నాగభూషణం రెడ్డిని ఆదేశించారు. రాంజల మున్సిపల్ పార్కుల్లో విరివిగా మొక్కలు పెంచి ఆహ్లాద వాతావరణం ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి పార్కుల స్థితిగతులను పరిశీలించి మెరుగుపరచాలని సూచించారు.

పార్కు ప్రదేశాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ముఖ్యమంత్రి హామీపై ఉద్యమానికి సన్నద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం సిఐటియు నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని తెలిపారు. రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 62 ఏళ్ల సర్వీసును వర్తింపజేయాలని కోరారు. గ్రాట్యుటీ, పింఛను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారని చెబుతున్న మంత్రులు, సలహాదారులు వైసిపి పాలనలో ఎంతమంది కార్మికులను రెగ్యులరైజ్ చేశారో ప్రకటించాలని తెలిపారు. సిఐటియు నాయకులు వి.రాజు, ఎస్.ఆంటోని, కె.రాజు, కె.సురేష్, ఎం.అబ్బుల్లా, జె.నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

చరిత్ర సృష్టించిన ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్

- ఎస్‌బిఐ కర్నూలు ఏజిఎం శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆదోని

95 ఏళ్ల ఆదోని ఎస్‌బిఐ చరిత్రలో రూ.65 కోట్ల రుణాలిచ్చి ఆదోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ అబ్దుల్ రావూఫ్ చరిత్ర సృష్టించారని ఎస్‌బిఐ కర్నూలు ఏజిఎం శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలోని మెయిన్ బ్రాంచిలో వ్యాపార వేత్తలు, బిల్డర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఇకపై స్టేట్ బ్యాంక్ కస్టమర్లకు అవస్థలు ఉండవని, గంటల తరబడి నిరీక్షించకుండా ఉండేందుకు తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం చీఫ్ మేనేజర్ అబ్దుల్ రావూఫ్ మాట్లాడారు. కస్టమర్లతోనే సంస్థ నడుస్తోందని, అలాంటి కస్టమర్లకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా హౌసింగ్ లోన్, మరే ఇతర లోన్లకు రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తిరగకుండా అతి త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులకు కరెంటు అకౌంట్ తెరిచేందుకు 9వ కౌంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అకౌంట్ తెరవాలనుకునే వారు రూ.5 వేలు నగదు, ఆధార్, పాస్ పోర్ట్, పాన్ కార్డ్ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ లేని వారికి మున్సిపాలిటీలో లైసెన్స్ సదుపాయం ఉందని, ఇందుకు కూడా తమ సహకారం ఉంటుందని చెప్పారు. ఎఒ నేతాజీ, అసిస్టెంట్ మేనేజర్ మహబూబ్ బాష, ఎస్‌బిఐ సిబ్బంది, పట్టణంలోని బిల్డర్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మినీ ట్యాంకుకు కుళాయి ఏర్పాటు చేయండి

పెద్దకడుబూరు : మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో పైకోటలో గోపాల్ తాత ఇంటి వద్ద మినీ ట్యాంకుకు కుళాయి ఏర్పాటు చేయకపోవడంతో నీరు వృథాగా డ్రెయినేజీ పాలవుతోంది. పైకోటలో పోతురాజు ఇంటి వద్ద ఉన్న మినీ ట్యాంకు నీరు ఎక్కడం లేదని కాలనీవాసులు శనివారం వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి గోపాల్ తాత ఇంటి వద్ద ఉన్న మినీ ట్యాంకుకు కుళాయి ఏర్పాటు చేసి, వాలు ఏర్పాటు చేయాలని, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.

22న ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం మంత్రాలయంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కూలీలకు కేటాయిస్తున్న బడ్జెట్‌ను తగ్గిస్తూ వస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ అటెండెన్స్ ఎత్తివేయాలని కోరారు. పని దినాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని, వేసవిలో ఇస్తున్న సమ్మర్ అలవెన్స్‌ను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కూలీల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ దగ్గర జరుగు ధర్నాలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మండల నాయకులు జయరాజు, ప్రాణేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : ఉపాధి హామీ చట్టం కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతు సంఘం మండల నాయకులు బాష విమర్శించారు. మండలంలోని పెద్దతుంబలం, కుప్పగల్లు, హనవాళ్, జి.హోసళ్లి గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లోకి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చి నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత ఉపాధి కూలీలపై ఉందని తెలిపారు. 2022-23 సంవత్సరంలో ఉపాధి హామీ చట్టానికి రూ.89 వేల కోట్లు ఖర్చు కాగా, ఈఏడాది కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించి ఉపాధి హామీ చట్టానికి కోత పెట్టిందని విమర్శించారు. పని దినాలు తగ్గించాలని దురుద్దేశంతోనే బిజెపి ప్రభుత్వం నిధులు తగ్గించిందని మండిపడ్డారు. రెండు పూటల పని, ఆన్‌లైన్ మస్టర్ విధానం వల్ల కూలీలకు నష్టం జరుగుతోందని తెలిపారు. సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, గడ్డపార సాన పెట్టుకోవడానికి రూ.50, నీరు, నీడ, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈనెల 22న కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ధర్నాకు వ్యకాస అఖిల భారత నాయకులు బీవీ.రాఘవులు హాజరవుతున్నారని తెలిపారు. వ్యకాస నాయకులు చిన్న బుడ్డి వెంకటేష్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఈడిగ తిక్కన్న, సిఐటియు నాయకులు దేవదాసు ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. **కోసిగి (రూరల్)** మండలంలోని కోల్‌మాన్‌పేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ప్రజాసంఘాల నాయకులు రాముడు, వీరేష్ పరిశీలించి, ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజిబాబు

కరపత్రాలను అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 14వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, డ్రెయినేజీ, సిసి రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గతంలో రోడ్లు వేశారని, డ్రెయినేజీలు ఎత్తుగా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశించారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందడం వల్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మాలపల్లి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరిగి జగనన్న నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాల అమలు తీరు గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్ లెట్ అందజేసి వైసిపికి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా షాదీ తోఫా గోడపత్రికను ఆవిష్కరించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, నాయకులు గురురాజారావు, ఎంపిడిఒ ప్రభావతి పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

భూమి పూజ చేస్తున్న తహశీల్దార్ వెంకటేష్ నాయక్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకునూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం-1 నూతన భవన నిర్మాణానికి తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమిత్రలు శనివారం భూమి పూజ నిర్వహించారు. ముందుగా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు పౌష్టికాహార పదార్థాలను ఇవ్వాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సమతుల్య ఆహారం సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. గతంలో అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలంలో ఇద్దరు వ్యక్తులు దిబ్బలు వేసుకొని ఉండగా తహశీల్దార్ వారితో మాట్లాడి ఆ స్థలాన్ని అంగన్వాడీ కేంద్రానికి కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ప్రొక్లెయిన్ సహాయంతో ఆ స్థలాన్ని శుభ్రం చేయించి గ్రామస్తుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. విఆర్ఒ హరికృష్ణ, వైకెపి హెచ్‌డిసిసి నరసన్న పాల్గొన్నారు.

ఇమ్రాన్ పాస్‌పోర్టు స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

దుబాయ్ వెళ్లి ఇబ్బందుల్లో ఉన్న ఇమ్రాన్ పాస్‌పోర్టును దుబాయ్ యజమాని నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆదోనికి చెందిన గౌస్ బాష శనివారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఆదోనికి చెందిన ఇమ్రాన్ బాష దుబాయ్‌లో చిక్కుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. యంబసీలో ఆయన వీసా, భారత్‌కు పంపించే అంశంపై గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షులు గుండెపల్లి నరసింహ కసరత్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇమ్రాన్ ఊపిరి పీల్చుకుని గౌస్, సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తీవ్రమైన ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ డాక్టర్ జమీల్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

తీవ్రమైన ఎండలున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డాక్టర్ జమీల్ అహ్మద్ సూచించారు. శనివారం ఆయన ప్రభుత్వాస్పత్రిలోని తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. చాలామంది వడదెబ్బకు గురై ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారన్నారు. వారికి వెంటనే ప్రథమ చికిత్స చేస్తున్నామని తెలిపారు. చాలామంది ఈ ఎండలు ఏం చేస్తాయిలే అనే భావనతో బయట అనవసరంగా తిరిగి అలసట చెంది విరోచనాలకు ఉగురవుతున్నారని చెప్పారు. అనవసరంగా తిరగడం మంచిది కాదన్నారు. ఆస్పత్రికి వచ్చేవారు ఎక్కువ భాగం ఇంటిపాటున ఉండే వారన్నారు. పొలం పనులు చేసుకునే వారికి వేడిని తట్టుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఎవరికైనా ఇబ్బందిగా ఉంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకొని చల్లటి పానీయాలు, ఫ్రూట్స్ తీసుకోవడం మంచిదని తెలిపారు. వడ దెబ్బకు గురైన వారు వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఎలాంటి అలసత్వమూ పనికిరాదన్నారు. ఎఎన్ఎంలు, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నరసయ్య మృతి టిడిపికి తీరని లోటు

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సింగరాసుపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు బోయ నరసయ్య మృతి పార్టీకి తీరని లోటని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నరసయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన శనివారం గ్రామానికి చేరుకుని నరసయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పి మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేశారు. క్లస్టర్ ఇన్‌ఛార్జీ చావిడి వెంకటేష్, గోపాల్ రెడ్డి, మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, ముని, దేవదాసు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని తహశీల్దార్ బంగారమ్మ తెలిపారు. శనివారం మండలంలోని గుడికల్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పనితీరును పరిశీలించారు. ఇళ్లను త్వరగా పూర్తి చేసి ఇవ్వాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను, హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో మొత్తం 108 మంది లబ్ధిదారులకు గాను 5గురు మాత్రమే స్లాబ్ లెవల్‌లో పూర్తి చేసుకున్నట్లు, 34 గృహాలు బేస్ లెవెల్‌లోనే ఆగిపోయినట్లు గుర్తించారు. ఇఒఆర్‌డి విజయలక్ష్మి, సర్పంచి నాగేష్ పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా
- ప్రారంభమైన విద్యా వైజ్ఞానిక తరగతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేస్తూ, విద్యారంగం పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అబ్దుల్లా తెలిపారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో మాస్టర్‌గా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప హాజరై మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ప్రభుత్వ విద్యను కషాయీకరణం చేస్తూ ప్రభుత్వ విద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు దూరం చేసి ప్రయివేట్ విద్యాసంస్థలకు లాభం చేకూరేలా చేస్తోందని తెలిపారు. నూతన విద్యావిధానం పేరుతో చరిత్రకారుల జీవిత చరిత్రను తొలగించడం, లౌకిక విధానాన్ని అమలు చేయకుండా నిరంకుశ విధానాన్ని అవలంబిస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం, భవిష్యత్తులో ఉపాధ్యాయ పోస్టులు లేకుండా చేసి నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, జిల్లా ఉపాధక్షులు కరుణాకర్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు దండు ఖాజా, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు, రామన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగమణి

'రోడ్డు మరమ్మతులు చేపట్టాలి'

ప్రజాశక్తి - హోళగుంద

ఢణాపురం టు హోళగుంద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, ఢణాపురం, హెబ్బటం మీదుగా ఆర్‌టిసి బస్సులు నడపాలని టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య కోరారు. శనివారం స్థానిక బస్టాండులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల నుంచి రోడ్డు పాడైపోయిందని, ఢణాపురం నుంచి హోళగుంద రోడ్డులో బస్సులు నడిపితే ఆదాయం కన్నా ఖర్చులు పెరిగాయని తెలిపారు. ఆదోని డిపో మేనేజర్ ఆలూరు మీదుగా హోళగుందకు బస్సులు నడపడం బాధాకరమన్నారు. ఇలాంటి ఆలోచనలు విరమించుకోవాలన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చొరవ తీసుకొని మార్లమడిగి రోడ్డు, ఢణాపురం నుంచి హోళగుంద రోడ్డు నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా కృషి చేయాలని కోరారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎంపిడిఒ గీతావాణి - నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ గీతావాణి సూచించారు. శనివారం మండలంలోని ఆరెకల్ జడ్‌పి పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడవద్దని చెప్పారు. పచ్చని మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉట్టిపడేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయులు భవానికి సూచించారు. కుప్పగల్ గ్రామంలో జగనన్న కాలనీని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి నాగరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగ మల్లయ్య, హౌసింగ్ తిక్కన్న, ఆర్ఐ పెద్దయ్య, విఆర్ఒ కౌశిక్ వామన్ రావు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని ఐరన్‌గల్ గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్లబండ అంబ భవాని పీఠాధిపతులు మఠ్రిస్వామి తాత వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనకు హాజరయ్యారు. ఐరన్‌గల్ వాల్మీకి సంఘం కమిటీ నాయకులు తలారి నరసన్న, వెంకటేష్, చిన్న వీరేష్, సంజీవరెడ్డి, చిన్న గిడ్డయ్య, తమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. వాల్మీకి మహర్షి విగ్రహాన్ని వాల్మీకి నాయకులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అందజేశారు. వాల్మీకి మహర్షి ఆలయానికి టైల్స్, స్టీల్ గ్రిల్‌ను మాధవరం రాఘవేంద్ర రెడ్డి, రామకష్ణారెడ్డిలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు. వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి కోసిగి వాల్మీకి నాయకులు ముత్తురెడ్డి ఆర్థిక సహాయం అందజేశారని చెప్పారు. వాల్మీకి నాయకులు ఉలిగయ్య, పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, జ్ఞానేశ్, వక్రాణి వెంకటేష్, చింతలగేని నర్సారెడ్డి, మాదేవా, నరసింహులు, కొండగేని ఈరెడ్డి, పంపాపతి, హోటల్ వీరేష్, గుడిసె శ్రీరాములు, రంగముని నాయుడు, గుండేష్, శివ, శరబంధ స్వామి, విగ్రహ ప్రతిష్టాపనకు హాజరై వాల్మీకి మహర్షికి పూజలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ... వాల్మీకులు పార్టీలకతీతంగా ఐక్యమత్యంగా ఉండి వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటం చేసి సాధించుకోవాలని కోరారు. వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మంత్రాలయం నియోజకవర్గంలో 80 శాతం వాల్మీకులు ఉన్నారని తెలిపారు. అనంతరం గ్రామ వాల్మీకి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వాల్మీకి నాయకులు లసుమయ్య, జనార్ధన్, లక్ష్మీకాంత్, గోపాల్, దేవేంద్ర పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

కేక్ కట్ చేస్తున్న సిద్ధరామయ్య అభిమానులు

సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారంపై హర్షం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎంతో ఉత్కంఠ రేపిన కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం, ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని పెద్ద హరివాణం గ్రామానికి చెందిన సిద్ధరామయ్య అభిమానులు మెడికల్ నాగరాజ్, కేశవ, రంగనాథ్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, కేక్ కట్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడారు. 2013లో సిద్ధరామయ్య మొదటిసారి కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 136 అసెంబ్లీ స్థానాలు దక్కడంతో సిద్ధరామయ్యకు మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం దక్కిందని చెప్పారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ మల్లగుల్లాలు పడి డికెను బుజ్జగించి ఉప ముఖ్యమంత్రి పదవిని కేటాయించి, సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా నిర్ణయించడం శుభ పరిణామమని తెలిపారు. ధర్మన్న, బలరాం, వీరేష్, ముదుకప్ప పాల్గొన్నారు.

సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారం నేపథ్యంలో మాదాసి కురువల సంబరాలు

ప్రజాశక్తి - హాలహర్వి

కర్ణాటక ముఖ్యమంత్రిగా కురువ సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా హాలహర్విలో మాదాసి కురువలు సంబరాలు జరుపుకున్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల మదాసి కురువలు కలిసి హాలహర్విలోని కనకదాసు విగ్రహానికి పూలమాల వేసి, బీరప్ప డొల్ల వాయిద్యాలతో ప్రత్యేక పూజలు చేసి బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ముఖ్యఅతిథిగా బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ భర్త కృష్ణమోహన్, హాలహర్వి జడ్‌పిటిసి లింగన్న, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, మదాసి కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమల్లప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ మోహన్ హాజరయ్యారు. మాదాసి కురువ ఆలూరు తాలూకా కన్వీనర్ కొడికే రాజు, కోకన్వీనర్ నిట్రవట్టి బసవరాజు, సంగోలి రాయన్న సేన తాలూకా కన్వీనర్ పరసల ఉమేష్, ఆరికెరి గొర్ల సంఘం అధ్యక్షులు వెంకప్ప, కార్యవర్గ సభ్యులు కురువెళ్లి రమేష్, శ్రీనివాసులు, కోరమండల్ ఏజెన్సీ నేత రాజు, హనుమంతు రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

చిన్న పెండేకల్ ఉపాధి అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వివరాలు సేకరిస్తున్న జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్

చిన్నపెండేకల్ గ్రామంలో ఉపాధి అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని చిన్న పెండేకల్‌లో పనులు చేయకుండానే రూ.లక్షలు స్వాహా చేస్తున్నారని, విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. శనివారం మండలంలోని చిన్న పెండేకల్ గ్రామంలో పర్యటించి ఉపాధి కూలీలతో, ఇరువు గ్రూపులతో జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్, ఏపీడీ లోకేష్, ఎంపిడిఒ గీతావాణి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో, పని చేస్తున్న ప్రదేశాల్లో వేతనదారులతో మాట్లాడి సంబంధిత వ్యక్తి ఉపాధి పనులకు వచ్చారా, లేదా, పనికొస్తే ఎన్ని రోజులు వచ్చారు వంటి విషయాలను వేతనదారులను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ఇరు గ్రూపులను విచారణ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించిన క్షేత్ర సహాయకులు, ఉపాధి పనులకు వెళ్లకుండా వెళ్లినట్లు అనధికార వ్యక్తులతో విచారణ జరపడం విమర్శలకు దారితీస్తోంది. వేతనదారుల సమక్షంలో విచారణ చేపడితే అసలు విషయం బయటపడుతుందని, నలుగురి మధ్య జరగాల్సిన విచారణ, నాలుగు గోడల మధ్య చేశారు. ఇలాంటి విచారణతో ఉపయోగం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదే మాదిరిగా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు, ఇందుకు సీనియర్ మేటీలు చక్రం తిప్పుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

బ్యాంకు ముందు పొదుపు మహిళల బైఠాయింపు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

బ్యాంకు ముందు బైఠాయించిన పొదుపు మహిళలు

కోసిగిలో ఎస్‌బిఐ బ్యాంకు ముందు పొదుపు మహిళలు శనివారం బైఠాయించారు. పొదుపు అప్పునకు జమ చేయమని ఎస్‌బిఐ బ్యాంకు బీసీ పాయింట్ నిర్వాహకుడికి డబ్బులు ఇస్తే, రూ.7,500 మాత్రమే తమ ఖాతాకు వేసి, మిగతా రూ.20 వేలు వేయకుండా మోసం చేశాడని భాగ్యలక్ష్మి పొదుపు మహిళలు బ్యాంకు అధికారుల ముందు వాపోయారు. బీసీ పాయింట్ నిర్వాహకుడు నీలి నరసింహులు చేసిన నిర్వాకానికి తమ పొదుపు గ్రూపు మహిళల్లో తాను దొంగనయ్యానని, పది మందికి సమాధానం చెప్పలేక పోతున్నామని ఓ పొదుపు మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.27,500 బీసీ పాయింట్ నిర్వాహకుడికి కట్టిన రిసీప్ట్ ఉందన్నారు. ఆ రిసీప్ట్ ఎక్కడైనా పోయి ఉంటే తమను ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని, లేదా తమ పొదుపు అప్పు ఖాతాకు జమ చేయాలని బ్యాంకు అధికారులను కోరారు. ఎస్‌బిఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ జోక్యం చేసుకుని సోమవారం బీసీ పాయింట్ నిర్వాహకుని పిలిపించి, మీ డబ్బులను తిరిగి ఇప్పిస్తామని పొదుపు మహిళలకు సర్ది చెప్పారు.

దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం

- తగిన మూల్యం చెల్లించక తప్పదు
- జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప హెచ్చరించారు. జనసేన కార్యకర్త విజయ్ కుమార్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డిపై సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులూ పెట్టకపోయినా తమ కార్యకర్త విజయ్ కుమార్‌పై భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. గత వారం రోజులుగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై వ్యక్తిగత దూషణలు చేస్తూ కుటుంబ సభ్యులపై కూడా అధికార పార్టీ సోషల్ మీడియా సభ్యులు అసభ్యకరమైన పోస్టులు పెడుతూ వేధిస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకునిపై సోషల్ మీడియాలో కామెంట్లు పెడితే సహించేది లేదంటూ హెచ్చరికలు జారీ చేస్తూ తమ కార్యకర్తలు, నాయకులను భయాందోళనకు గురి చేస్తున్నారని చెప్పారు. గతంలో మహేష్ యాదవ్‌పై కూడా దాడి చేశారని, పోలీసులు సూచన మేరకు కేసు రాజీ అయ్యామని తెలిపారు. ఆ ఘటన మరువక ముందే ఎస్‌కెడి కాలనీలోని ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్న విజయ్ కుమార్‌పై రాజు, గోపి, కార్తీక్‌లు భౌతిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. గాయాలపాలైన విజయ్‌కుమార్‌ను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించామన్నారు. ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. బాధితుడు విజయ్ కుమార్, నాయకులు రాజశేఖర్, రేణువర్మ, చిరుత రాజశేఖర్ ఉన్నారు.

పోలీసు స్టేషన్ ముందు మాట్లాడుతున్న జనసేన నాయకులు

చిప్పగిరిలో గాలివాన - నేలకొరిగిన చెట్లు

చిప్పగిరి : చిప్పగిరిలో శనివారం సాయంత్రం గాలివానకు వేర్లతో సహా చెట్లు కూలిపోయాయి. కొందనగుర్తి, చిప్పగిరి మధ్యలో ఉన్న చెట్లు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాలకు పూర్తి అంతరాయం కలిగినట్లు ప్రయాణికులు తెలిపారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులందరూ భయభ్రాంతులకు గురయ్యారు.

ప్రజాశక్తి
ఆదివారం 21 మే 2023
5
నంద్యాల

గాలివానకు లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు

దళిత గ్రామంపై వివక్ష

- మధ్యలోనే ఆగిన బ్రిడ్జి నిర్మాణం
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లలేని పరిస్థితి
- ఇబ్బందుల్లో కోల్స్ ఆనందపురం గ్రామస్తులు

పిల్లర్లతోనే ఆగిన నూతన బ్రిడ్జి నిర్మాణం

శిథిలావస్థకు చేరిన పురాతన బ్రిడ్జి

ప్రజాశక్తి - పాములపాడు

దళితుల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వాలు పని చేస్తున్నాయని అధికార పార్టీ నేతలు బహిరంగ సభల్లో ఊదరగొట్టు ఉపన్యాసాలు ఇస్తుంటారు. దళితుల పక్షపాతమని చెప్పుకుంటూ, వారి అభివృద్ధి కోసం గ్రామాల్లోని దళితవాడలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఉపన్యాసాలు, హామీలు ఇస్తుంటారు. ఉమ్మడి రాష్ట్రం నుండి ప్రభుత్వాలు మారినా, ఎమ్మెల్యేలు మారినా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా నేటికీ దళిత గ్రామమైన కోల్స్ ఆనందపురం బ్రిడ్జి సమస్య పరిష్కారాని నోచుకోవడం లేదు. దళిత గ్రామమైనందుకే అధికారులు, పాలకులు సమస్యను పట్టించుకోకుండా వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు..

పాములపాడు మండలంలోని జూటూరు మజరా గ్రామం కోల్స్ ఆనందపురం పూర్తిగా దళిత గ్రామం. ఈ గ్రామానికి వెళ్లాలంటే కెసి కెనాల్‌పై ఉన్న బ్రిడ్జి దాటి వెళ్లాలి. కానీ కెనాల్‌పై ఉన్న వారధి బ్రిటిష్ కాలం నాటిది కావడంతో శిధిలావస్థకు చేరుకుంది. దీంతో వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. బ్రిటీష్ కాలంలో కెసి కెనాల్‌పై నిర్మించిన వంతెనలను గత ఇరవై సంవత్సరాల క్రితం కూలగొట్టి కొత్తగా నిర్మించారు. కానీ ఈ గ్రామంలో ఉన్న వంతెనను మాత్రం అలాగే వదిలేశారు. 2007లో నాటి జడ్పి చైర్మన్ లబ్బి వెంకటస్వామి పాత బ్రిడ్జి ప్రక్కనే కొత్త వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పిల్లర్స్ వరకు నిర్మించి మధ్యలో వదిలేశారు. నాటి నుండి నేటి వరకు వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. పలు ప్రజా సంఘాల నాయకులు, సిపిఎం, వామపక్షాల నాయకులు ఎన్నోసార్లు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీని సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం డిలిమిటేషన్ చేశాక నందికొట్కూరు నియోజకవర్గం ఎస్‌సి రిజర్వ్ కావడంతో ముగ్గురు దళిత ఎమ్మెల్యేలు మారినప్పటికీ దళిత గ్రామ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ఈ ఘటన వివక్షకు నిదర్శనం. నేటికైనా ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

కోల్స్ ఆనంద పురం గ్రామానికి కెసి కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని కల్పించాలి. ఈ సమస్యపై ఎన్నోసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పెడచెవిన పెడుతున్నారు. రైతులు ధాన్యాన్ని అమ్ము కోవాలంటే గ్రామానికి వాహనాలు రాక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- సామన్న, సిపిఎం మండల కార్యదర్శి.

దళిత గ్రామంపై వివక్ష తగదు

కెసి కెనాల్‌పై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనలను కూలగొట్టి గత 20 సంవత్సరాల కిందటే కొత్తగా నిర్మించారు. ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాలలో మళ్లీ కొత్త బ్రిడ్జిలు నిర్మించేందుకు బడ్జెట్ శాంక్షన్ అయింది. కానీ దళిత గ్రామమైన కోల్స్ ఆనందపురానికి పురాతనమైన బ్రిడ్జి కూలగొట్టి బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు, ప్రభుత్వం వివక్ష చూపుతున్నారు. ముగ్గురు దళిత ఎమ్మెల్యేలు పని చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం సిగ్గుచేటైన విషయం. ఇప్పటికైనా స్పందించకపోతే నిరాహార దీక్షలు చేపడతాం.

- స్వాములు, బిఎస్‌పి నందికొట్కూర్ ఇంచార్జి.

గాలివాన బీభత్సం

- భానుముక్కలలో ఇండ్లపై పడిన పురాతన భారీ వృక్షం
- తప్పిన పెను ప్రమాదం - రహదారి వెంట విరిగి పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పాణ్యంలో తడిచిపోయిన వరి, మొక్కజొన్నధాన్యం

ప్రజాశక్తి - పాములపాడు

వేళ్లతో సహా కూలిపోయిన పురాతన భారీ వృక్షం

పాములపాడు మండలంలోని భానుముక్కల, ఎర్రగుడూరు, బానకచెర్ల గ్రామాలలో శనివారం సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో కురిసిన గాలి వర్షం బీభత్సం సృష్టించింది. గాలికి రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లకు అడ్డంగా చెట్లు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. భానుముక్కల గ్రామంలో 300 సంవత్సరాల క్రితం నుండి ఉన్న రావి చెట్టు గాలివానకు వేర్లతో సహా లేచి గడ్డం దేవ సహాయం, గడ్డం బాలమ్మ ఇండ్లపై పడింది. దేవ సహాయం రేకుల షెడ్డు కూలిపోయింది. బాలమ్మ ఇంటి గోడ కూలిపోయి నష్టం వాటిల్లింది. అదే సమయంలో గడ్డం దేవ సహాయం ఇంటి రేకులు గాలికి లేచిపోతుండడంతో మరొక చోటికి వెళ్లిపోయారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణాష్టం జరగలేదు. ఆస్తి నష్టం జరగడంతో భోరున విలపించారు. సంఘటన స్థలానికి భానుముక్కల వీఆర్వో హుస్సేన్ చేరుకొని పరిశీలించారు. వీఆర్వోకు బాధితులు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే భానుముక్కలలోని ఎంపియుపి స్కూల్లో చెట్టు కూలి ప్రహరీ గోడపై పడటంతో పడిపోయింది. బానుముక్కల టర్నింగ్ వద్ద వేంపెంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్లు కూలి పడడంతో సంఘటన స్థలానికి ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ యాగంటి, టవేశ్వర్‌లు చేరుకుని చెట్లను తొలగించారు. రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఎర్ర గూడూరు, భానుముక్కల టర్నింగ్ మధ్యలో ప్రధాన రహదారిపై కూడా చెట్లు కూలి విరిగిపడ్డాయి. బానకచర్ల, టర్నింగ్ మధ్య విద్యుత్ స్తంభాలు కూలి విరిగిపడ్డాయి. **పాణ్యం :** పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీలో శనివారం సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఈదురు గాలులతో కూడిన బారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా వాతావరణం చల్లబడింది. రహదారిపై రైతులు అరబోసుకున్న వరి, మొక్కజొన్నలు వర్షానికి తడిచిపోయాయి. బస్టాండ్, బిసి కాలనీ, ఎఆర్ కాలనీ ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు రహదారుల వెంట ప్రవహించింది. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పాణ్యంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

నవాబుల కోటలో 'యువగళం'

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ వెంట మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బిసి ఇందిరా, మహిళలు

ప్రజాశక్తి - బనగానపల్లె

యువగళం పాదయాత్ర నవాబుల కోటలోకి ప్రవేశించింది. శనివారం మండలంలోని కైప విడిది కేంద్రం నుండి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. లోకేష్ పాదయాత్రకు జనం భారీగా కదిలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, నంద్యాల రోడ్డులోని రౌండ్‌ల వద్ద మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర ఆధ్వర్యంలో మహిళలు లోకేష్ పాదయాత్రకు హారతులు పట్టి స్వాగతం పలికారు. లోకేష్ వెంట మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, మాజీమంత్రి ఎన్ఎండి ఫరూక్, డోన్ ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, గొర్రెల పెంపకదారుల సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్‌లు పాదయాత్రలో నడిచారు. పాదయాత్ర కైప విడిది కేంద్రం నుండి మిట్టపల్లి, బనగానపల్లె, ఇల్లూరు కొత్తపేట, గులాంపేట మీదుగా అమ్మడాల మెట్ట వరకు సాగింది. 15 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. ఆయా గ్రామాలలో ప్రజలు పలు సమస్యలను లోకేష్‌కు విన్నవించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించి అందరికీ ఆమోదయోగ్యమైన పాలన అందిస్తామని లోకేష్ తెలిపారు. అనంతరం బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం సమీపంలో ముస్లింలతో ముఖాముఖి నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలిలో ఎస్టీ సామాజిక వర్గంతో, అవుకు మెట్ట సమీపంలో బుడగ జంగాలతో, ఇల్లూరు కొత్తపేట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. బుడగజంగాలు తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని లోకేష్ దృష్టికి తెచ్చారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ముస్లింలను దగా చేశారని, జగన్ పాలనలో వేధింపులు తాళలేక ముస్లింలు ఆత్మహత్య చేసుకుంటున్నారని నారా లోకేష్ తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ముస్లింలకు న్యాయం చేస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు.

గజమాలతో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి, నాయకులు

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి, టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథరెడ్డి, మాజీ ఎంపిపి అంబాల రామకృష్ణారెడ్డి, ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరమణ నాయక్, వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, పాతపాడు, మిట్టపల్లి సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసి రెడ్డి, నాయకులు కృష్ణా నాయక్, వెంకటరాముడు నాయక్, రాయలసీమ సలాం, టిప్ టాప్ కలాం, లాయర్ నాగేంద్ర రెడ్డి, కొణిదెల పుల్లారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, పెద్దరాజుపాలెం భూషన్న, ఇల్లూరు కొత్తపేట మాజీ సర్పంచులు రామిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, కైప రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఆస్తి కోసం తండ్రిపై తనయులు దాడి

ప్రజాశక్తి - రుద్రవరం : ఆస్తి కోసం కన్న తండ్రిపై తనయులు దాడి చేసిన ఘటన మండలంలోని బి.నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రుద్రవరం ఏఎస్ఐ రాంభూపాల్ రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మజ్జిగ పెద్ద లింగమయ్యకు ముగ్గురు కుమారులు. వీరికి సమానంగా ఆస్తి పంచి ఇచ్చాడు. తన జీవనం కోసం కొంత భూమిని తీసుకొని చిన్న కుమారుడు దగ్గర జీవిస్తున్నాడు. అయితే ఉన్న పొలాన్ని కూడా పంచి ఇవ్వాలని పెద్ద లింగమయ్యను కుమారులు శివలింగం, బాల లింగం, చంద్రకళ, పుష్పలత కలిసి దాడి చేసి అతని తీవ్రంగా కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మల్లన్న హుండీ కానుకలు లెక్కింపు

- 26 రోజుల్లో రూ . 2.8 కోట్లు ఆదాయం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు, పరివార ఆలయాల్లో భక్తులు హుండీలలో చెల్లించుకున్న కానుకలను శనివారం లెక్కించారు. గడిచిన 26 రోజులలో భక్తులు చెల్లించుకున్న కానుకలను కళ్యాణ మండపంలో లెక్కించగా నగదు రూ. 2 కోట్ల 80 లక్షల 75 వేల 669 లభించింది. వీటితో పాటు 177 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 3 కేజీల 500 గ్రాముల వెండి లభించాయి. విదేశీ కరెన్సీలు యూఎస్ఏ డాలర్లు 769, మలేషియా రింగ్స్ 3, యూరోపియన్ 70, సింగపూర్ డాలర్లు 10, యూఏఈ దిరహంస 25, కెనడా డాలర్లు 80 లభించాయి. పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య సిసి కెమెరాల నిఘాతో ఈ హుండీ లెక్కింపు జరిగిందనిదేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. దేవస్థానం సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

దస్తగిరి సేవలు మరువలేనివి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : యుటిఎఫ్ సీనియర్ నాయకులు దివరగత దస్తగిరి సేవలు మరువలేనివని సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో దస్తగిరి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, యూనియన్ అభివృద్ధికి దస్తగిరి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. దస్తగిరి సేవలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వీరారెడ్డి, నాగభూషణం రెడ్డి, పుల్లయ్య, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరి చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

నకిలీ విత్తనాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్
- వైఎస్ఆర్ పశుభీమా పథకం కింద ఎద్దులకు కూడా ప్రీమియం వర్తింపు
- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నకిలీ విత్తనాల నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో 20 మెట్రిక్ టన్నుల ఎరువులు, విత్తనాలు సాగుకు ముందే సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బికెల్లో రైతులు వేసుకున్న ప్రతి పంటను ఈ క్రాఫ్ బుకింగ్ చేయడంతోపాటు ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడులు సాధించే పంటలపై అవగాహన కల్పించాలన్నారు. పిఎం కిసాన్ కింద పెండింగులో వుండి అర్హత కలిగిన 29,764 మంది రైతుల ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచి పంట ఉత్పత్తులపై పూర్తి అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను సూచించారు. పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా వుండాలన్నారు. వైయస్సార్ పశుభీమా పథకం కింద పశువులు, మేకలు గొర్రెలకు బీమా వర్తించే తరహాలోనే ఎద్దులకు కూడా వర్తించే విధంగా వచ్చే నెల నుండి ప్రారంభించనున్నారని తెలిపారు. మొత్తం ప్రీమియంలో 80 శాతం ప్రభుత్వం భరిస్తుండగా 20 శాతం లబ్ధిదారుల వాటాగా ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్లో అన్ని బ్యాంకులు రైతులకు సకాలంలో రుణాలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణను సూచించారు. నంద్యాల ప్రాంతంలో 55 నర్సరీలు వున్నాయని, నకిలీ విత్తనాల విక్రయ ప్రక్రియను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని సూచించారు. సమావేశంలో మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి.నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్ రావు, ఇరిగేషన్, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, ఎపిఎంఐపి, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

టిడిపి పాలనలోనే అభివృద్ధి : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి పాలనలోనే బనగానపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని జిఎం టాకీస్ కూడలిలో యువగళం పాదయాత్ర సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజక వర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. బనగానపల్లె పట్టణంలో కిలోమీటర్ రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి మూడు సంవత్సరాలు పట్టిందని విమర్శించారు. టిడిపి పాలనలో నియోజక వర్గంలో 350 కిలోమీటర్లు సిసి రోడ్లు వేసినట్లు తెలిపారు. దద్దనాల ఎత్తిపోతల పథకాన్ని సాధించామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి జిఎం టాకీస్ వరకు వైసిపి పాలనలో రోడ్డు వేయడానికి మూడు సంవత్సరాలు పట్టిందని, నారా లోకేష్ వస్తుంటే హడావుడిగా గుంతలు తీసి పెట్టారని విమర్శించారు. బనగానపల్లె పట్టణంలో టిడిపి పాలనలో షాదిఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని, తాను 30 లక్షల సొంత నిధులు ఖర్చు చేశానని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత షాదిఖానా నిర్మాణాన్ని ఆపివేసిందన్నారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా ప్రభుత్వ అంచనాల ప్రకారం సొంత నిధులు కోటి రూపాయలతో ఎమ్మెల్యే సహకరిస్తే షాదిఖానాను నిర్మిస్తానని తెలిపారు. పట్టణంలో వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి తాను 12.75 లక్షల రూపాయలను సొంత నిధులు ఇచ్చానని, టీటీడీ ద్వారా 75 లక్షల నిధులు మంజూరు చేయిస్తే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. యువగళం పాదయాత్రతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో ఉన్న నారాయణ స్కూల్‌ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్ తెలిపారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నారాయణ స్కూల్‌ను సరైన మౌలిక సదుపాయాలు లేకుండా నడుపుతున్నారని చెప్పారు. వాహనాలు ఫిట్నెస్ లేకుండా నడుపుతున్నారని తెలిపారు. వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయని, అకాడమిక్ ఇయర్ మొదలుకాకముందే అక్రమ అడ్మిషన్ చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న నారాయణ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హరివర్ధాన్, లోకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

నిప్పుల కొలిమి...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

మార్చి చివరి వారం నుంచి భానుడు భగభగలాడుతూ ఎండ వేడిమిని పెంచుతున్నాడు. జిల్లాలో వేసవి తీవ్రత అధికమై నిప్పుల కొలిమిని తలపిస్తోంది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెల మొదటి వారంలో నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆత్మకూరులో 36, డోన్ 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి 26 నాటికి ఆ ఉష్ణోగ్రత 4 డిగ్రీలు అధికంగా నమోదైంది. నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో 41 డిగ్రీలను తాకింది. ఆత్మకూరులో 40 డిగ్రీలు, డోన్లో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం మరింత వేడి పెరగడంతో అత్యధికంగా ఆళ్లగడ్డలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాణ్యం, నంద్యాలలో 44, బనగానపల్లె, శ్రీశైలం, నందికొట్కూరులో 43, డోన్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే నెలాఖరు వరకు ఎలాంటి ఎండలు ఉంటాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కొనసాగుతున్న యువగళం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. తొలుత డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, పాణ్యం, కర్నూలు, నందికొట్కూరు, శ్రీశైలం, నంద్యాల నియోజకవర్గాల్లో ముగిసింది. ప్రస్తుతం బనగానపల్లె నియోజకవర్గంలో సాగుతోంది. అడుగడుగునా పలు వర్గాలు, గ్రామస్తులు, పలు సంఘాల ప్రతినిధులు లోకేషను కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు.

నంద్యాల టిడిపిలో విభేదాలు

నంద్యాల జిల్లా టిడిపిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఎపి విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఎవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మధ్య గతం నుండే విభేదాలు ఉన్నాయి. పలు సందర్భాల్లో అవి బయటపడ్డాయి. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా మంగళవారం మరోసారి ఆ రెండు గ్రూపుల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

పూర్తైన గృహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాస్

గృహ నిర్మాణాలు వేగవంతం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చాగలమర్రి : జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని సిబ్బందికి నంద్యాల ఆర్‌డిఒ శ్రీనివాస్ సూచించారు. చాగలమర్రి పట్టణంలోని కస్తూరిభా, కూలూరు రస్తాలోని జగనన్న లే అవుట్లను ఆయన శనివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఎన్ని చోట్ల ఎన్ని గృహాలు పూర్తయ్యాయని సంబంధిత సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 2072 గృహాలు మంజూరు కాగా 352 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని ఆర్‌డిఒకు వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ మాధవరావు, డిఈ నాగరాజు, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి, రీ సర్వే డిటి శ్రీనివాస రెడ్డి, ఎఇ షఫివుల్లా, మండల సర్వేయర్ కేశవ రెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్లు శివ, ఓబులేసు, సచివాలయాల ఇంజనీరింగు సహాయకులు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని ఎర్రగుడి దిన్నె, మాచినేనిపల్లె గ్రామాలలో హౌసింగ్ లే అవుట్లను, గృహ నిర్మాణ పనులను ఎంపిడిఒ మధుసూధన రెడ్డి పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శులు జయ రాముడు, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాదు, ఇంజనీర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది ఉన్నారు. **ఆళ్లగడ్డ :** లబ్ధిదారులు కేటాయించిన స్థలాలలో ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి, మండల అధికారుల బృందం అన్నారు. కోట కందుకూరు లేఅవుట్ నందు మండల స్థాయి అధికారులు సందర్శించారు. పంచాయతీ రాజ్ ఏఈ కమల్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర నాయక్, హౌసింగ్ ఏఈ నరసింహ, ఎలక్ట్రికల్ ఏఈ కంబగిరి, వర్క్ ఇన్స్పెక్టర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనంతపురం ఎంపీని కలిసిన వాల్మీకులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : వాల్మీకుల ఎస్‌టి అంశంపై నిరంతరం పోరాటం చేస్తున్న అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను జిల్లా నాయకులు పులి కొండన్న, నాగేశ్వరావు, వాల్మీకులు దేవాదుల పవన్ గోపాల్, మండ్ల సుధాకర్‌లు శనివారం గోస్పాడులో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయం పార్లమెంట్‌లో ప్రస్తావన చేసానని, ఎస్టీ బిల్లు ఆర్‌జిఐ వరకూ చేరిందని తెలిపారు. కార్యక్రమంలో శేఖర్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు, డ్రెయినేజీలను కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో డ్రెయినేజీ కాలువలను, ఆర్టీసీ బస్టాండ్ నుండి జిఎం టాకీస్ వరకు వేస్తున్న డబల్ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ శనివారం పరిశీలించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ వైద్యశాలను, డిఎంఎఫ్ నిధులతో చేస్తున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో శివరామయ్య, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిసి రోడ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శనివారం బండి ఆత్మకూర్ కొత్త కొట్టాల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తకోటల కాలనీలో 40 సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఎమ్మెల్యే డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెందాలంటే వైసిపిని ఆదరించాలని కోరారు. డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కొంత సమయం తీసుకున్నామని, ఒక్క నెల లోపల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కో ఆప్షన్స్ సభ్యుడు దూదేకుల జమాల్ గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి మంచి భాషతో విమర్శించాలని హితువు పలికారు. నారా లోకేష్ రాజకీయ పరిజ్ఞానం లేనివాడని, దొడ్డిదారిన రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రతి ఎమ్మెల్యేకు ఏదో ఒక పేరు అంటగడుతూ నియోజకవర్గాలలో అశాంతి చెలరేగేలా చేస్తున్నాడని అన్నారు. ఇలాంటి పద్ధతులతో రాజకీయాల్లో పైకి రారని చెప్పారు. రాజకీయాలు చేయాలంటే ప్రజల్లో తిరిగి, ప్రజాసేవ చేయాలన్నారు. నారా లోకేష్ తనకు పెట్టిన పేరుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపిపి దేశ వెంకట్రాంరెడ్డి, వైసిపి కన్వీనర్ బారెడి శ్రీనివాసరెడ్డి, సర్పంచి ఎరుకల సంధ్య, మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపిపి ముంతల మధురాణి, ఉప సర్పంచి అవుటాల నాగేశ్వర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎ.చిన్న నారాయణరెడ్డి, ఎంపిటిసి పుల్లయ్య, తహశీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, ఆర్‌డబ్ల్యూఎస్సీ లక్ష్మీనరసింహ, విఆర్‌ఏఈ వెంకటయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఫాతిమాను ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దాతలు ప్రోత్సాహం ఉంటే పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. ఫాతిమా స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. శనివారం ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ట్యాబ్‌లను ఆయన నివాసంలో దాత ఫాతిమతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గత కొన్ని నెలల క్రితం నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థినిలు తమకు ట్యాబ్ లేదా కంప్యూటర్‌ను సాయం చేయాలని విద్యార్థినీలు కోరిన విషయం విధితమే. ఆ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఫాతిమా అనే మహిళ స్పందించి ట్యాబ్‌లను తాను విద్యార్థినులకు అందిస్తానని చెప్పారు. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి స్ఫూర్తితో తనకున్న దాంట్లో కొంత పేదవారికి, అవసరార్థులకు సాయం చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థినులకు ట్యాబ్‌లను అందజేశారు. విద్యార్థినుల భవిష్యత్తుకు సాయం అందించడం సంతోషంగా ఉందని, ఫాతిమాను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రత్యేకంగా ఫాతిమాను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, వైఎస్ఆర్సిపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, సాయి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ట్యాబ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, దాత ఫాతిమా

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. గడివేముల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్రపోలూరు గ్రామంలో 420 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గ్రామస్తులు సహకరించాలని తెలిపారు. మండలంలోని రెవెన్యూ కార్యాలయంలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసిల్దారుకు సూచించారు. చాలామందికి రేషన్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు అందరం లేదని వారిని గుర్తించి రేషన్ కార్డును మంజూరు చేయాలని అధికారులను కోరారు. మండలంలోని గ్రామాలలో సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించి ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి అందని వారికి అందేలా సర్వే చేపట్టాలని తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి. మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ. తహసిల్దార్ శ్రీనివాసులు. ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప. ఈఓఆర్డి కళిక్ భాషా. వ్యవసాయ అధికారి హేమ సుందర్ రెడ్డి. ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి. మండల కో ఆప్షన్ నెంబర్ హుస్సేన్ బాషా. సర్పంచులు రమాదేవి. రాములమ్మ. శేఖర్. మాలిక్ భాషా. ఆర్‌బికె చైర్మన్ పుల్లయ్య. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదర్శలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాల కోసం 9849215838 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఇంటర్ వారికి ప్రత్యేక బాలికల హాస్టల్ సదుపాయం అందుబాటులోకి ఉందని తెలిపారు.

పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ముఖ్య లక్ష్యమని ఎర్రమఠం వైద్యాధికారి సౌజన్య తెలిపారు. శనివారం కొత్తపల్లి మండలంలోని నల్లమల్ల అటవీ సమీప గ్రామం కపిలేశ్వరంలో ఎర్రమఠం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది సత్యం రెడ్డి, శాంతమ్మ, నిర్మల, జయమణి, ఎంఎల్‌హెచ్‌పి రాజేష్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

ప్రజాశక్తి - బేతంచర్ల : నంద్యాల జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామం నివాసి రామతీర్థం శేషు మాదిగ ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా డోన్ నియోజకవర్గం కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో రామతీర్థం శేషు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గుండాల ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.

సచివాలయాన్ని డిఎల్‌డిఒ తనిఖీ

ఉద్యోగుల పని తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని రామాపురం, చెర్లోపల్లె గ్రామాల్లోని సచివాలయాలను డిఎల్‌డిఒ జనార్ధన్ రావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రామాపురం సచివాలయం-1లో ఉద్యోగుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల మెయింటెనెన్స్, స్పందన కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి రావడంతో ఉద్యోగుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెర్లోపల్లిలో ఉన్న సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు.

అన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని దేవస్థాన నిత్య అన్న ప్రసాద పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. నంద్యాలకు చెందిన ఎం లక్ష్మణస్వామి రూ.1,01,116, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన నాగ సుష్మ రూ.1,01,116 అందజేశారు. ముందుగా వీరు విడివిడిగా స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. ఆ తర్వాత అన్న ప్రసాద పథకానికి విరాళాలు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు శేష వస్త్రాలను, ప్రసాదాలను, సంబంధిత పత్రాలను అందజేశారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామం జడ్పిహెచ్ హైస్కూల్ 2001-2002 పదవ తరగతి పూర్వ విద్యార్థులందరు కలిసి రంగాపురం గ్రామంలోని శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ముఖద్వారం దగ్గర భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు, ప్రజలకు ఉచితంగా చల్లని మజ్జిగ, నీరు పంపిణీ చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు.

స్క్రాప్ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం స్క్రాప్ వాహనాలకు తాహసిల్దార్ హరినాథ్ రావు ఆధ్వర్యంలో పట్టణ సీఐ జీవన్ గంగనాద్ బాబు, ఎస్సైలు వెంకటరెడ్డి, తిమ్మయ్యలు వేలంపాటలు నిర్వహించారు. స్విఫ్ట్ డిజైర్ కారు, 11 మోటార్ సైకిల్‌లను వేలంలో విక్రయించారు. సిఐ మాట్లాడుతూ రవాణా అధికారులు నిర్దేశించిన ధర కన్నా రూ.1.15 లక్షలు అదనంగా వచ్చాయన్నారు.

22న ఆలయ భూముల కౌలుకు వేలం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరంలో వెలసిన భాస్కర నందీశ్వర, దుర్వి నరసింహ స్వామి, ఆంజనేయస్వామి, ఆలయాల సంబంధించిన మాన్యం భూముల కౌలుకు ఈ నెల 22న వేలం పాటలు నిర్వహిస్తున్నారు. శనివారం దేవాదాయ కార్యనిర్వహణ అధికారి సాయి జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు భాస్కర నందీశ్వర ఆలయంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలంపాటలు నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాట పాడే రైతులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం సమీపాన రైస్ మిల్లు వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. నంద్యాలకు చెందిన వెంకటేశ్వర్లు (45) అమెజాన్ మినీ వ్యాన్‌ను నడుపుతూ నంద్యాల నుండి కర్నూల్ వైపు వెళ్తుండగా పాణ్యం సమీపాన రైస్ మిల్లు వద్ద వెనకాల వస్తున్న ఐచర్ వాహనం ఢీ కొట్టింది. దీంతో అమెజాన్ మినీ వ్యాన్ బోల్తా పడింది.

డ్రైవర్ వెంకటేశ్వర్లు కింద పడ్డాడు. అతనిపై వాహనం పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పాణ్యం పోలీసులు అతనిని నంద్యాల ఆసుపత్రికి తరలిస్తుంగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు.

టిటిడి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పగిడ్యాల : మండలంలోని బీరవోలు గ్రామంలోని సుంకుల పరమేశ్వరి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకట్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, ఉమా మహేశ్వరి పీఠ బొగ్గుల శివారెడ్డి, చెన్నకేశవ ఆలయ కమిటీ సభ్యులు రమణయ్య శెట్టి, పూజారి పెద్ద శివన్న, భజన కమిటీ అధ్యక్షులు నారాయణ, బాలస్వామి, కరణం రమణమ్మ, డీలర్ కుమార్, పుష్పవతమ్మ, నీలమ్మ, నాగలక్ష్మమ్మ, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలకు చెందిన కొంతమంది విద్యార్థులు వివిధ ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్థానిక కళాశాలలో శనివారం ప్రైవేటు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు.. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు వేతనం సంవత్సరానికి 2 లక్షల నుంచి 4.20 లక్షల రూపాయల వరకు ఉంటుందన్నారు. తమ కళాశాలలో చదివే డిగ్రీ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యా నైపుణ్యాలకు ధీటుగా ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలను పొందే విధంగా దేశ్ పాండే వారి సహకారంతో కృషి చేస్తున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ ఓబన్న పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి

- ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు

ప్రజాశక్తి - రుద్రవరం

తాగునీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని చలమ రేంజి పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని కోటకొండ గ్రామంలో చలమరేంజ్ అధికారి ఈశ్వరయ్య ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణపై ఆయన చలమ రేంజి కోటకొండ ఫారెస్ట్ అసిస్టెంట్ బీటు అధికారి బాలరాజుతో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజల సమక్షంలో 'పర్యావరణ కోసం జీవనశైలి'లో భాగంగా వారందరితో ప్రతిజ్ఞ చేయించి, ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలని, ఇంటి ముందు ఉన్న నీటి కొళాయిల వద్ద నీటిని వృధా చేస్తూ నీటిని నిలువ చేయరాదని, పగటి పూట కరెంటును వృధా చేయరాదని, ఇంటింటికి కనీసం ఒక మొక్కను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. **శ్రీశైలం :** శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామంలో, మాణికేశ్వరి మాత గూడెం, శ్రీశైలం (కర్ణాటక సత్రం), మేకలబండ, హఠకేశ్వరం ప్రాంతాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నరసింహులు మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బంది కె.మదనకుమార్, పి. సలాంఅల్లా, యస్. భీమ్ నాయక్, పి.శ్రీరాములు, రవీంద్రనాథ్ ఠాగూర్, కొమరం భీమ్ గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం పాల్గొన్నారు.

కోటకొండలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నూర్జహాన్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అవుకు రిజర్వాయరులో జరిగిన బోటు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయురాలు నూర్జహాన్ కుటుంబ సభ్యులకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఇటీవల అవుకు రిజర్వాయర్ బోటు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయురాలు నూర్జహాన్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి అండగా ఉంటామని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నంద్యాల జిల్లా అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. మెగా డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయిస్తామన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్ మూడు సంవత్సరం నుంచి 8 సంవత్సరాలకు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైసిపి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు పూర్తి నమ్మకంతో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ సుధాకర్, బాలాజీ విద్యా మందిర్ కరస్పాండెంట్ వెంకట స్వామి, వాసవి దస్తగిరి, నలంద పాఠశాల కరస్పాండెంట్ ఉత్తేజ్, సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - శ్రీశైలం

ప్రభుత్వం గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని కొమరం భీం ఆదివాసి, చెంచు గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం డిమాండ్ చేశారు. శ్రీశైలం పరిధిలో ఉన్న మాణిక్యేశ్వరి చెంచుగూడెంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాణిక్యేశ్వరి మాత చెంచు గిరిజన గూడెంలో 32 కుటుంబాలు దాదాపు 50 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్నారని తెలిపారు. అయితే వారి గూడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఓట్లు, ప్రాథమిక హక్కులు ఉండటంతో ఐటిడిఎ అధికారులు కరెంటు, తాగునీరు ఏర్పాటు చేశారని తెలిపారు. వీటి ఆధారంగా వారుంటున్న పూరి గుడిసెలను ఫారెస్ట్, రెవిన్యూ, ఐటిడిఎ అధికారులు, అటవీ హక్కుల చట్టం కింద గ్రామ కమిటీ ఏర్పాటు చేసి మూడుసార్లు సర్వే చేశారని, ముగ్గురు డిఎఫ్ఒలు మారారని, అయినా ఇళ్ల పట్టాల మంజూరుకు ఎవరూ స్పందించట్లేదని తెలిపారు. అటవీ హక్కుల నిబంధన ఆర్టికల్ 75 ప్రకారం చెంచు గిరిజనులు 10 సంవత్సరాల నుండి ఒకే చోట నివాసం ఉంటే ప్రాథమిక హక్కులు కల్పించాలని, అయితే ఫారెస్ట్ అధికారులు, ప్రభుత్వం చెంచు గిరిజనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చెంచు గిరిజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కొమరం భీమ్ ఆదివాసి చెంచి గిరిజన సంఘం అధ్యక్షులు కుడుముల వెంకటేశ్వర్లు, వీరయ్య, బయమ్మ, మంతమ్మ, అంకమ్మ, చెంచు గిరిజనులు పాల్గొన్నారు.

మాట్లడుతున్న నాయకులు

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో రూ.2500లకు సుదూర ప్రాంతాలలో పని చేసిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి ప్రసాద్, జె.సుధాకర్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వర్క్ అడ్జస్ట్మెంట్ ఉపాధ్యాయులకు తక్షణమే రూ.2500 చెల్లించాలని, వారందరికీ ప్రమోషన్, రక్షణ కల్పించాలన్నారు. కోర్టు కేసులు వున్నాయని గతంలో ఇచ్చిన ప్రమోషన్‌లు రద్దు చేయడం దారుణమన్నారు. 117 జీవో కోర్టులో రద్దు అయితే అప్పుడు ఈ ప్రమోషన్‌ల పరిస్థితి ఏమిటని, అప్పుడు మరలా రద్దు చేస్తారా..? అని వారు ప్రశ్నించారు. అధికారులు సుదీర్ఘంగా ఆలోచించి భద్రతతో కూడిన ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, రామ్ మోహన్, బాలస్వామి, రామకృష్ణుడు, వేంకటేశ్వర రెడ్డి అరవింద్, మహ్మద్ హుస్సేన్, రామకృష్ణా రెడ్డి, ఫిదా హుస్సేన్, మధు, రవి, శ్రావణ్, రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోరుతూ 22న ఆమరణ నిరాహార దీక్ష

- వెంకటేశ్వరపురం గ్రామ కౌలు రైతు అవుకు ఏసు

ప్రజాశక్తి - నంద్యాల : ఎస్‌పి, కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని, రాయ వెంకటేశ్వర రెడ్డి నుంచి తనకు ధాన్యం డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని ఈ నెల 22వ తేది నుండి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటున్నట్లు శిరివెళ్ల మండలం వెంకటేశ్వరపురం గ్రామ కౌలు రైతు అవుకు ఏసు తెలిపారు. శనివారం నంద్యాలలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధితుడు అవుకు ఏసు మాట్లాడారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ముద్దాయిలను, వారికి సహకరించిన వారిని వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరాడు.

లోకేష్ సభకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - అవుకు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా బనగానపల్లెలో శనివారం జరిగిన బహిరంగ సభకు అవుకు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. టిడిపి నాయకులు గూడల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాపరెడ్డిల ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలతో తరలి వెళ్లారు. అవుకు మండలం యువ నాయకులు ఐవి ఉగ్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలను, అభిమానులను భారీ స్థాయిలో తరలించారు. **బేతంచెర్ల :** బనగానపల్లెలో జరిగిన బహిరంగ సభకు బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, రాష్ట్ర ముస్లిం నాయకులు జాకిరుల్ల బేగ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర నాయక్, రాష్ట్ర క్రిస్టియన్ కార్యదర్శి మేకల నాగరాజు, మండల ముస్లిం మైనార్టీ నాయకులు ముల్లా, కౌన్సిలర్స్ రామాంజనేయులు, రాంగోపాల్, నంద్యాల మధు తదితరులు తరలివెళ్లారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శనివారం డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్ వరకు రూ.2 కోట్ల 80 లక్షలతో నిర్మిస్తున్న 60 అడుగుల బిటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాద్ రెడ్డి సహకారంతో డోన్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మరో రెండు రోజుల్లో ఈ రోడ్డును పునరుద్ధరించబడుతుందని తెలియజేశారు. పాదచారులు ఇబ్బంది పడకుండా రోడ్డుకి ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేసి దానితో పాటు ఫుట్ పాత్, కూర్చోడానికి వీలుగా అక్కడక్కడ సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

త్వరలో వాసవి ప్రతిభ అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-డోన్

ఆవోపా ఆధ్వర్యంలో వాసవి ప్రతిభ అవార్డులను విద్యార్థులకు త్వరలో ప్రదానం చేయనున్నట్లు ఆవోపా డోన్ సెక్రటరీ జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలో 10వ తరగతి ఫలితాల్లో 500 మార్కులు పైగా సాధించిన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు వాసవి ప్రతిభ అవార్డ్సును ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 1, 2, 3 ప్రైజ్‌లను నిర్ణయించామని, మార్కు లిస్టు జిరాక్స్ కాఫీ, ఒక పాస్ పోర్టు సైజు ఫోటో బుధవారం లోపల వైస్ ప్రెసిడెంట్ రాజ సుధాకర్, సెక్రెటరీ జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి, ట్రెజరర్ శేగు సుదర్శన్ రావులకు అందించాలని కోరారు.

మనోభావాలు దెబ్బ తీసేలా బాబు వ్యాఖ్యలు

- వైసిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద, బడుగు, బలహీన వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా తీవ్రంగా ఖండించారు. పేదలకు ఇళ్లు ఇస్తే స్మశానాలతో పోల్చడం దురదృష్టకరమన్నారు. చంద్ర బాబు నాయుడు వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం నుండి వైసిపి నాయకుల ఆధ్వర్యంలో శ్రీనివాస సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం చంద్ర బాబు నాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సెంటు స్థలాన్ని స్మశానాలతో పోల్చడం చంద్రబాబు నాయుడు దురహంకారానికి నిదర్శనమన్నారు. రాబోవు కాలంలో పేద, బడుగు బలహీనవర్గాలు చంద్రబాబు నాయుడును అదే స్మశానంలో నిలబెడతారని అన్నారు. కార్యక్రమంలో దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **నందికొట్కూరు :** రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు వర్గాలకు ఇచ్చిన సెంటు భూమిలో శవం పూడ్చడానికి పనికిరాదని మాజీ సిఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నందికొట్కూరు పట్టణంలో ఎమ్మెల్యే ఆర్థర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద బడుగు వర్గాలను కించపరిచే విధంగా చంద్రబాబు మాట్లాడడం తగదన్నారు. జగనన్న కాలనీలలో ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలోనే ఇల్లు చక్కగా నిర్మించుకున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక తప్పుడు విమర్శలు చేయడం తగదన్నారు. వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచర్ల రఘురామయ్య, రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షులు వంగాల సిద్ధారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ సుకూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు దిలీప్ రాజు, నాయకులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** బడుగు బలహీన వర్గాల వారిని అవమానకరంగా మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వైయస్సార్ పార్టీ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు నాయకులు, కార్యకర్తలు భారీగా ర్యాలీ నిర్వహించి స్థానిక పాత బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. నాయకులు భాస్కర్, సిమెంట్ నగర్ యాకోబు, గూని నాగరాజు, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు, గోరుమానుకొండ సర్పంచ్ కూడా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ఎద్దులన్న, అవుకు కృష్ణమూర్తి ,తిమ్మయ్య, హరి, మద్దిలేటి స్వామి ,వెంకటేశ్వర్లు, కిరణ్, నవీన్, గుమ్మగాళ్ల రాజు, నడ్డి శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నంద్యాలలో బాబు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న నాయకులు

నందికొట్కూరులో నిరసన చేపడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్